క్లుప్తంగా

నాణ్యమైన విద్య అందించండి

డీవైఈఓ వినయ్‌కుమార్

గుడివాడటౌన్(నందివాడ): ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా వ్యవహరించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డీవైఈఓ పి వినయ్‌కుమార్ కోరారు. నందివాడ మండలం నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన మంగళవారం పరిశీలించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతులు, మధ్యాహ్న భోజనాలు పలు అంశాలను తనిఖీ చేశారు. టీచర్స్ లెసన్ ప్లాన్‌లు పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించాలని ఆయన సూచించారు. ప్రధానోపాధ్యాయడు జి. డేవిడ్ రత్నరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, రైతులకు అవగాహన

పామర్రు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. స్థానిక చైతన్య కళాశాల ఆవరణలో ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి కుట్రలు పన్నుతోందన్నారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఒడుగు గంగాధర్ ప్రసాద్, కౌలు రైతు జిల్లా అధ్యక్షులు శివ నాగేంద్ర, సీఐటీయు జిల్లా నాయకులు ఎంపోలినాయుడు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు శీలం ప్రకాష్‌రావు, గ్రామిక మహిళా నాయకురాలు కే ఉమారాణిలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు: డాక్టరు బి.ఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ఐదో తరగతి ఇంగ్లిషు మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు సోమవారం పేర్కొన్నారు. నల్లగుంట పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు అందజేయాలన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు ఈనెల 24 నుంచి మార్చి 24వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. నమోదు చేసుకున్న విద్యార్థులకు 23-04-2023వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నల్లగుంటలోని గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు ఉచితమేనని తెలిపారు.

చిరుదాన్యాల సాగుపై అవగాహన

మండవల్లి: మండలంలోని అల్లినగరం, కొర్లపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ సీఆర్పీ గౌతమ్ కుమార్ నవధాన్యాల సాగు విధానం, ఉపయోగాలు వివరించారు. మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు జంగం వరలక్ష్మి, సర్పంచ్‌లు జంపాన వీరబాబు, బోయిడి సురేష్ బాబు, నాగవిజయ, ఐసీఆర్పీలు షాహీనా, ఉషారాణి, రామారావు, జగన్, వెంకటసుబ్బారావు, అహోబలరావు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

కైకలూరు: మండలంలో ఆచవరం-శ్యామలాంబపురం రహదారి మార్గంలో వంతెనపై ఏర్పడిన గుంత ప్రమాదభరితంగా మారింది. దీంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కైకలూరు టౌన్ సీఐ ఎంవీ ఎస్.నాగరాజు తమ సిబ్బంది సహాయంతో రోడ్డుపై గుంతకు పూడ్చించారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

గుడ్లవల్లేరు: మండల అభివృద్ధికి ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీపీ కొడాలి సురేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి పేరిట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సౌజన్యంతో వీటికను ప్రచురించి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాంత ఉత్తీర్ణత సాధించేందుకు పంపిణీ చేశారని ఎంఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ నూరు శాతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఏఓ సునీల్ తెలిపారు. మండలంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో మంచి పురోగతి సాధిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాయన రవి, ఈఓపీఆర్డీ వి.దిలీప్ కుమార్, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలు

పామర్రు: స్థానిక అసిస్సి హైస్కూల్‌లో ఈనెల 28, 29 తేదీల్లో వైజ్ఞానిక పదర్శనలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ సునీ చాకో సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ఆలోచనలను, ప్రతిభను ప్రొత్సహించడానికి ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయుక్తం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ మెర్సి జోసఫ్, ఎంఈవో పి. విజయలక్ష్మి పాల్గొంటారు. ఆధునీకీకరించిన సైన్సు లాబ్‌ను మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు ఆవిష్కరిస్తారన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఈనెల 29వ తేదీ వరకు ప్రదర్శిస్తామని తెలిపారు.

ఆక్వా రంగానికి ఆక్సిజన్

- కైకలూరులో రాష్ట్ర మంచినీటి సంవర్ధక రిఫరల్ లేబొరేటరీ
- రాష్ట్రంలో రెండో లాబ్ ఇదే
- చేపల, రొయ్యల వ్యాధి నిర్ధారణ ల్యాబ్ ఆధునికీకరణ
- రైతుల సేవలో లాబొరేటరీ



కైకలూరులో మత్స్యశాఖ కార్యాలయం (ఇన్‌సెట్) ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కైకలూరు: ఆక్వా రంగానికి ఆయువు పట్టుగా మారింది కైకలూరులోని రాష్ట్ర మంచినీటి సంవర్ధక రిఫరల్ లేబొరేటరీ. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో కైకలూరులో చేపల, రొయ్యల వ్యాధి నిర్ధారణ ల్యాబ్ అధునికీకరణకు రూ.18.60 లక్షలు కేటాయించారు. సిబ్బందిని కూడా నియమించారు. దీంతో ల్యాబ్ రైతులకు సేవలు అందిస్తోంది.

67,230 ఎకరాల్లో ఆక్వా సాగు..

నియోజకవర్గంలో కైకలూరు మండలంలో 15,600 ఎకరాలు, కలిదిండి మండలంలో 19,339 ఎకరాలు, మండవల్లి మండలంలో 19,122 ఎకరాలు, ముదినేపల్లి మండలంలో 13,169 ఎకరాలు కలిపి మొత్తం 67,230 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఇందులో రొయ్యల సాగు 13,926 ఎకరాల్లో ఉంది. నియోజకవర్గంలో ఆక్వా రైతులు 12,824 మంది ఉన్నారు. ఆక్వా రంగాన్ని నమ్ముకుని వేలాది మంది జీవిస్తున్నారు. గ్రామ మత్స్యశాఖ సహాయకులు అందుబాటులోకి రావడంతో క్షేత్ర స్థాయిలో ఆక్వా రైతులకు మేలు జరుగుతోంది.

అత్యాధునిక పరికరాలు..

కైకలూరులో చేపల, రొయ్యల వ్యాధి నిర్ధారణ రిఫరల్ లేబొరేటరీ రాష్ట్రంలో రెండోది. కాకినాడ తర్వాత కై కలూరులో ల్యాబ్ మాత్రమే రిఫరల్ ల్యాబ్‌గా ఉంది. దీనిని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడానికి ప్రభుత్వం రూ.18.60 లక్షలు కేటాయించింది. ల్యాబ్‌లో మైక్రో బయోలజీ, హిస్టోపాథాలజీ, నీటి, మట్టి, మేత పరీక్షలు, పీసీఆర్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి.



ల్యాబ్‌లో మేత విశ్లేషణ యంత్రం

పీసీఆర్ పరీక్షలు..

ముఖ్యంగా పాలిమిరైజ్ చైన్ రియాక్షన్ (పీసీఆర్) అందుబాటులో ఉంది. దీంతో రొయ్యల పిల్లలకు ప్రాథమిక దశలోనే వైరస్ ఉంటే గుర్తించవచ్చు. డబ్ల్యూఎస్ఎస్‌వీ, ఈహెచ్‌పీ, ఈఎంఎస్, ఐఎంఎన్‌వీ పరీక్షలు ఒక్కొక్కటీ రూ.750, ఐహెచ్‌హెచ్ఎన్‌వీ, ఎంబీవీ, హెచ్‌పీవీ పరీక్షలు ఒక్కొక్కటీ రూ.600, ఆర్టీపీసీఆర్‌లో డబ్ల్యూఎస్ఎస్‌వీ రూ.800, ఈహెచ్‌పీ, ఐహెచ్‌హెచ్ఎన్‌వీ పరీక్షలు ఒక్కొక్కటీ రూ.800, విబ్రియో జాతులు రూ.1200కే పరీక్షలు చేస్తున్నారు. సెలినిటీ పీహెచ్, ఫ్లాంక్టాన్ అనాలసిస్, మట్టి పీహెచ్, చేపల, రొయ్యల మైక్రోస్కోపిక్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.

త్వరలో ఎలిషా విశ్లేషణ..

క్లోరమ్ ఫెనికాల్, నైట్రో ఫ్యూరాన్ మిటబాలైట్ పరీక్షలు ఒక్కొక్కటి రూ.1500కి త్వరలో అందుబాటులోకి రానున్నాయి. త్వరలో ఎంజైమ్ లింక్డ్ ఇమ్యునో సోర్బెంట్ ఆస్సే(ఎలిషా) టెస్టు అందుబాటులోకి రానుంది. దీంతో చేపల, రొయ్యల వ్యాధి నిర్ధారణ మరింత సులభతరం కానుంది. వివిధ మినరల్స్ శాతం ఎంతో తేల్చే పరీక్షలు తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయి.

సేవలను వినియోగించుకోవాలి..



ఆక్వా రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక రాయితీలు కల్పిస్తున్నారు. రాష్ట్రంలోనే రెండో చేపల, రొయ్యల వ్యాధి నిర్ధారణ కేంద్రంగా కై కలూరు ల్యాబ్ ఉంది. అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో ఎలిషా టెస్టులు ప్రారంభం కానున్నాయి.

– జి.రాజేష్, ఫిషరీస్ ఏడీ, ఆక్వా ల్యాబ్, కైకలూరు

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి షణ్ముఖరావు

కై కలూరు: క్షణికావేశంలో చేసిన చిన్న తప్పులకు జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు పరివర్తన చెంది బయటకు వచ్చి కుటుంబంతో చక్కటి జీవనం కొనసాగించాలని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు పేర్కొన్నారు. కై కలూరు సబ్‌జైలును ఆయన సోమవారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సేవలపై జైలు సూపరింటెండెంటు బొత్స అప్పారావు నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఖైదీల వంటశాల, గదులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు కోర్టులు ఉచితంగా న్యాయవాదులను సమకూరుస్తుందన్నారు. న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, జితేంద్ర, శ్యామ్, శ్రావణి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మొవ్వ: ఈ నెల 28న మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ సోమవారం తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు కొండేటి ఇందిర అధ్యక్షతన ఉదయం11 గంటల జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. ఆయా శాఖ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సమస్యలు గుర్తించి పరిష్కరించాలి

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: గృహ సారథులు సమస్యలు గుర్తించి పరిష్కరించాలని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ అన్నారు. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో మండల పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారథులు గుర్తించిన సమస్యలను సచివాలయ కన్వీనర్లకు తెలియజేసి వలంటీర్లతో కలిసి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రతి గృహస్తుడికి అండగా ఉండాలన్నారు. సక్రమంగా ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అన్నారు. రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరలా అధికారంలోకి తీసుకువచ్చే విధంగా అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండల సచివాలయ కన్వీనర్‌గా ఎంపికైన ముప్పిడి సురేష్ రెడ్డిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏ.రమాదేవి, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పీ రత్నకుమారి, నందిపు బేబి శాలిని, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, రైతు సలహామండలి అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు కె చంద్రశేఖర్‌రావు, దిరిశం రత్నకుమారి, జీ విజయ భారతి, ఎం శ్రీలక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, వార్డు మెంబర్లు ఏ.శ్రీహరి, యార్లగడ్డ శ్రీను, పవన్, కోటయ్య, పార్టీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు, చిన్నం శ్రీనివాసరావు, బుల్లిబాబు, బుజ్జి, ఎం.సత్తిరెడ్డి, పుట్టి కిషోర్, సింహాచలం, మండల సచివాలయ కన్వీనర్లు కాకర్ల శివ శంకర్, పోతాడి లక్ష్మీ శిరేక, గృహసారథులు అబ్దుల్ బాజాని, సూదులగంటి నందిని పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే కైలే పరామర్శ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్నవారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. తోట్లవల్లూరు ఎస్సీ ఏరియాలో అనారోగ్యంతో మృతి చెందిన ఈడ్పుగంటి భారతి (80) కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఈడ్పుగంటి పున్నయ్య, బందెల ఝాన్సీ, కొండిపాముల మహేష్, వల్లూరు వర్ధన్, భద్రిరాజుపాలెంలో ఆళ్ల వెంకటరెడ్డిని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పరామర్శించి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, మండల పార్టీ కన్వీనర్ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పుచ్చకాయల గనోజమ్మ, నాయకులు పీఎస్ కోటేశ్వరరావు, కిలారం రామకృష్ణ, ఈడ్పుగంటి ఎలీషా, ఈడ్పుగంటి రూబెన్, కిలారం గంగాధరరావు పాల్గొన్నారు.

మరో తాగునీటి చెరువు తవ్విస్తాం..

కై కలూరు: పెరిగిన జనాభా ఆధారంగా ఆటపాక మేజర్ పంచాయతీ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి మరో తాగునీటి చెరువు తవ్వకానికి అనుమతులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రసిద్ధ కనకలింగేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆవరణలో గ్రామ సభను సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటపాక పక్షుల కేంద్రానికి వెళ్లే రహదారి సమీపంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసామన్నారు. గ్రామస్తుల విరాళాలతో వివాహాలు జరిపేలా దీనిని నిర్మించుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులుగా కన్నా మునలయ్య, గుగ్గిలపు వెంకటరత్నం, సర్పంచ్ తలారి మణిమ్మ, ఉపసర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, చిల్లుముంత శ్యామలరావు, గుమ్మ వెంకన్న, రామిశెట్టి బాలవెంకట దుర్గారావు, కొదమల సురేష్, కన్నా రమేష్, కూనవరపు సతీష్, వెల్పూరి చంద్రయ్య, చొప్పాల రాము, వేల్పూరి నాగేశ్వరరావు, సింగంశెట్టి రాము, వడ్లాని సుబ్బారావులను నియమించారు. పీఏసీఎస్ అధ్యక్షులు పంజా రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు పట్టపు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయతపై అవగాహనకు సైన్స్ దోహదం

మండవల్లి: విద్యార్థులలో దాగిఉన్న శాస్త్రీయ అంశాలను వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తుందని డెప్యూటీ తహసీల్దార్ ఎం.సుధారాణి, సర్పంచ్ మెండా ఝాన్సి అన్నారు. సుధామ ఫౌండేషన్, ఐక్యవేదిక మండవల్లి శాఖ ఆధ్వర్యంలో హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రొఫెసర్ సూధాబత్తుల విజయ్‌కుమార్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, హెచ్ఎంలు, జి వెంకటేశ్వర్లు, కె.కృష్ణమోహన్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు ప్రారంభించారు. సుధారాణి, ఝాన్సి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే చదువుతో పాటు సైన్స్‌పై అవగాహన పెంచుకుని ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే డీఎన్నార్



తాడినాడలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కై కలూరు(కలిదిండి): గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. తాడినాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ముందుగా గ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు నివాళులర్పించారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు విద్యుత్ లైన్లు, తాగునీటి పైపులైన్లు, డ్రెయిన్ల ఏర్పాటు వంటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తాడినాడ సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు కేటాయించామన్నారు. తక్షణం అవసరమైన పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, జిల్లా పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైఎస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, తాడినాడ పీఏసీఎస్ అధ్యక్షుడు సాగి చిన్నబ్బాయి రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, నాయకులు కూసంపూడి సత్తులు రాజు, సాగి వెంకటరాజు, పెన్మెత్స కృష్ణంరాజు, పెన్మెత్స ఏడుకొండల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ సేవలన్నీ ఆధార్‌తో అనుసంధానం

విజయవాడ ఈపీఎఫ్ రీజినల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

గుడివాడటౌన్: ఈపీఎఫ్ సేవలను ఆధార్‌తో లింక్ చేశామని విజయవాడ ఈపీఎఫ్ రీజినల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో మంగళవారం 'నిధి ఆప్‌కే నిక్కట్' పేరుతో ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల నిర్వాహణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సంస్థ ఐనా నెలకు రూ.15 వేలు జీతం ఉన్న ఉద్యోగికి ఈపీఎఫ్ సదుపాయం కల్పించాలన్నారు. 2012 నుంచి ఈపీఎఫ్ సేవలను ఆన్‌లైన్ చేశారని, ఉద్యోగులకు ఎప్పుడైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అనారోగ్యం తదితరాలకు నగదు అవసరమైనప్పుడు నిల్వల్లో నుంచి కొంత తీసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరకాస్తు చేసుకుంటే పదిరోజుల్లో మీ బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఈఎస్ఐసీ అధికారి రమేష్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

కైకలూరు: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వేగవంతంగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ఏలూరురోడ్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో మడకా శ్రీనివాసరావు గృహప్రవేశ కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరయ్యారు. కాలనీలో నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు ఉగాది నాటికి అనుకున్న ఇంటి నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ అడివి వెంకట కష్ణ, హౌసింగ్ ఏఈ శేఖర్, నాయకులు తోటమహేష్, నాగిరెడ్డి రమేష్, సచివాలయ ఈఏ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ధ్యేయంగా పాలన

వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి



కైలే జ్ఞానమణి దంపతులను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

పామర్రు: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కై లే జ్ఞానమణి అన్నారు. పామర్రులోని శాసన సభ్యుల కార్యాలయంలో రెండో సారి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైన జ్ఞానమణికి నియోజకవర్గంలోని మహిళా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జ్ఞానమణి మాట్లాడుతూ మహిళలు చైతన్యం పొందిన నాడే కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని గ్రహించిన ప్రభుత్వం మహిళలు సాధికారిత దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు. రాజకీయాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. అనంతరం మహిళా నాయకులు జ్ఞానమణి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కె.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేశి, ఎంపీటీసీ పల్లికొండ రత్నకుమారి, నాయకురాలు రత్నాభాయి, కుందేటి రాణి, కైలే సభకీర్తి, ధనాల కృపావతి, మూల్పూరి హరిషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనే ధ్యేయం

పసుమర్రు(పామర్రు): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పసుమర్రు గ్రామం నుంచి గ్రామ శివారు వీరాబత్తినపురం వరకు నూతనంగా నిర్మించిన రహదారిని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 2.5 కిలోమీటర్ల దూరం రూ.1.20 కోట్ల నిధులతో ఈ బీటీ రహదారిని నిర్మించామన్నారు. లింక్ రహదార్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. సర్పంచ్ నాగేంద్రరరావు, పామర్రు ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు పెయ్యల రాజు, బి.కోటేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు. గంగుల వాని చెరువు నుంచి భోగిన వారి పాలెం వెళ్లేందుకు మార్గ మధ్యలో పుల్లేరు కాలువలో బల్లకట్టు ఏర్పాటు ఎమ్మెల్యే రూ.6.5 లక్షలను మంజూరు ప్రారంభించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలోని జోగేశ్వరరావు సెంటర్‌లో క్యాపిటల్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో 200 మందికి పైబడి గుండె, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. గతంలో నిర్వహించినఉచితకంటివైద్య శిబిరంలో గుర్తించిన 48 మందికి కళ్లజోళ్లు అందజేశారు. వాకర్స్‌క్లబ్ గవర్నర్ రామలింగరాజు, క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, బ్రహ్మజీ, ఎస్సై ప్రసాదు, ఈశ్వర వెంకటేశ్వరరావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మకు పంచహారతులు

కైకలూరు: ఈ నెల 21న ప్రారంభమైన పెద్దింట్లమ్మ జాతర సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. సమీప జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. పెద్దింట్లమ్మకు వివిధ పూజా కార్యక్రమాలను అర్చకులు పేటేటి పరమేశ్వరరావు నిర్వహించారు. వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నంకే చెందిన ముదునూరి నాగరాజు, గీతకృష్ణవేణి, పెనుమత్స శ్రీధర్ వర్మ, దివ్య దంపతులుఅందించారు. బెల్లపు నాగలక్ష్మి సమర్పణలో గుడివాడ శ్రీ రాజ రాజేశ్వరి నాట్య మండలిచే బాల నాగమ్మ జానపద నాటక ప్రదర్శన ఆకట్టుకుంది.

క్రైస్తవుల శిలువ ర్యాలీ

కైకలూరు: క్రైస్తవులు శిలువమార్గం ర్యాలీని సోమవారం లోకుమూడి గరువు నుంచి చావలిపాడు వరకు చేపట్టారు. భైరవపట్నం ఆర్‌సీఎం విచారణ పరిధిలోని లోకుమూడి చర్చికి చెందిన వందలాది మంది శిలువమార్గంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్, ఆర్‌సీఎం విచారణ సహాయక గురువు బండి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ తల్లి జాతర ప్రారంభం

పామర్రు: స్థానిక శ్రీగంగానమ్మతల్లి జాతర సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున గంగానమ్మతల్లిని మేళ తాళాలతో, కనక తప్పెట్లతో మేలు కొలుపులు జరిపారు. అనంతరం ఆలయం వద్ద నుంచి గ్రామోత్సవానికి గంగానమ్మ బయలుదేరింది. గ్రామ పొలిమేరల్లో కట్టడి కట్టి గ్రామంలో గంగానమ్మను ఊరేగించారు. మేళ తాళాలతో, కొమ్ము వాయిద్యాలు, డప్పులతో, చిన్నా పెద్ద అందరూ కలిసి గ్రామంలోని 14,15,16,17 వార్డుల్లో ఊరేగింపు జరిపారు. పోతురాజు గడను అమ్మవారి ఘటం కుండలకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హారతులు ఇచ్చి చద్ది నివేదనలను, నూతన వస్త్రాలను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి హారతులను స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి, సభ్యులు ఎస్.బాలసుబ్రమణ్యేశ్వరరెడ్డి, బి రాజశేఖర్‌రెడ్డి, జీ చంద్రశేఖరరెడ్డి, ఎం.అంజిరెడ్డి, బీ శ్రీనివాసరెడ్డి, మనోహర్ రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, డి.బాల వెంకటేశ్వరరెడ్డి, కె.సుబ్బారెడ్డి, సూరవరపు కృష్ణ తెలిపారు.

లూర్థుమాత ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం వెన్ననపూడి గ్రామంలో లూర్థుమాత మహోత్సవాలు జయప్రదం చెయ్యాలని సంఘ విచారణ గురువు ఫాదర్ కూచిపూడి ప్రశాంత్ కోరారు. గ్రామంలోని లూర్థుమాత ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉత్సవ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మార్చి 9, 10, 11 తేదీల్లో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. విచారణ పరిధిలోని అన్ని సంఘాల విశ్వాసులతో నవదిన ఆరాధనలు ప్రారంభిస్తామన్నారు. 9వ తేదీ దివ్యబలిపూజ, లూర్థుమాత స్వరూప ప్రదక్షిణతో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. రాత్రి 9 గంటలకు శిలువధారి బైబిల్ నాటకం, 10న ధర్మవిజయం నాటిక, 11న లూర్థు మాత స్వరూప ప్రదక్షిణ, సమష్టి దివ్యబలిపూజ ఉంటుందన్నారు. విజయవాడ పీఠాధిపతులు బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు పాల్గొంటారన్నారు. రాత్రి లాజరు-ధనవంతుడు నాటిక ప్రదర్శిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేవారు మాస్క్ ధరించడం, శానిటైజర్ ఉపయోగించాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఉచ్చుల జయరాజు, కోడె యాకోబు, నీలం ఉదయ్ కుమార్, సింగవరపు ప్రేమ్‌కుమార్, అరవ బర్నబాస్, మేడేపల్లి విజయరాజు, దేవదర్శనం, వీరాబత్తిన లాజరు, అబ్రహాంలు పాల్గొన్నారు.